క్లుప్తంగా

ఇస్కాన్ క్యాలెండర్ అందజేత



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికకు క్యాలెండర్ అందిస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి టీఎన్.దీపికకు ఇస్కాన్ ప్రతినిధి గోవిందచరణ్‌దాస్ ఇస్కాన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందజేశారు. శుక్రవారం రాత్రి ఇస్కాన్ ఆలయ ప్రతినిధులు వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి తరలివచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రకుమార్

గోరంట్ల: అధికారులు రాజకీయలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని ఎంపీపీ ప్రమీల పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలని ఎంపీపీ సూచించారు. ఆయా శాఖల పరిధిలో ప్రభుత్వ పరంగా సాగుతున్న పనుల పురోగతిని మండలాధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్, తహసీల్దార్ మారుతీప్రసాద్, వివిధ శాఖల అధికారులు, వైస్ ఎంపీపీ నాగభూషణరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రెడ్ల ఐక్యత చాటాలి



మాట్లాడుతున్న రెడ్డి జేఏసీ నాయకులు

హిందూపురం: మహాయోగి వేమన జయంతి వేడుకలకు రెడ్డి కులస్తులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని రెడ్డి సంఘం జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈనెల 19న ఉదయం 10 గంటలకు ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద నుంచి బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని కులస్తులందరూ తరలివచ్చి విజయవంతం చేసి రెడ్ల ఐక్యతను చాటిచెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు సడ్లపల్లి వెంకటేష్ రెడ్డి, పరమేష్ రెడ్డి, సుబ్బిరెడ్డి, సింగిరెడ్డిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం




డా.రామచంద్రను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: రాష్ట్ర ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్ఈఎఫ్) అధ్యక్షుడు డాక్టర్ రామచంద్రను ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుక్రవారం పట్టణంలో ఘనంగా సన్మానించారు. ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర మడకశిర పర్యటనకు వచ్చారు. దీంతో మడకశిర తాలూకా ఆర్ఈఎఫ్ నాయకులు కె.భూతన్న, వీఎస్ మాలింగప్ప, వై.జోగన్న, టి.మూడ్లగిరియప్ప, బి.ఈశ్వరప్ప, దేవరాజు, రవికుమార్, నరసింహరాజు తదితరులు శాలువ కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. రామచంద్ర మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఉద్యోగుల సంక్షేమం కోసం అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్అండ్‌బీ డీఈగా లక్ష్మీనారాయణ

మడకశిర: మడకశిర ఆర్అండ్‌బీ డీఈగా లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. దీంతో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన మడకశిర ఆర్అండ్‌బీ జేఈగా కూడా పని చేశారు.

జేజేఎం శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక తాలూకా పంచాయతీ సమితి సభా ప్రాంగణంలో జేజేఎం (జల జీవన్ మిషన్) శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. తాలూకా పంచాయతీ ఈఓ జానకీరాం మాట్లాడుతూ శిక్షణ తరగతులకు తాలూకా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల అధ్యక్షులు, పీడీఓలు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

ముళ్ల పొదల్లో జటాయువు ఘాట్

- ఆగిపోయిన అభివృద్ధి పనులు
- లేపాక్షి ఖ్యాతిని చాటుతామని ఎమ్మెల్యే బాలకృష్ణ గొప్పలు
- ఏళ్లు గడుస్తున్నా చేతల్లో మాత్రం చేసి చూపించని వైనం
- అధికారులు, ఎమ్మెల్యే తీరుపై స్థానికుల అసంతృప్తి



అర్ధంతరంగా ఆగిపోయిన గుప్తకామేశ్వరుడి ఆలయం



స్తంభాలు కిందనే పడవేసిన దృశ్యం

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షికి కిలో మీటరు దూరంలో ఉన్న జటాయువు మోక్ష ఘాట్ ముళ్ల పొదలకే పరిమితమైంది. అభివృద్ధి పనులు నిలిచిపోవడమే కాకుండా గుప్తకామేశ్వరుడు, గుప్త కామేశ్వరి ఆలయాలు పనులు కూడా నిలిచిపోయాయి. లేపాక్షి ఖ్యాతిని దశదిశలా చాటి చెబుతామన్న ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

అభివృద్ధి పనులకు టీటీడీ నిధులు

2016లో జరిగిన నంది ఉత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో జటాయువు ఘాట్‌కు వెళ్లేందుకు రోడ్లు, వీధిలైట్లు, పరిసరాలను శుభ్రం చేశారు. దీన్ని మరింత అభివృద్ధి చేయడానికి, దేవాలయ పునర్నిర్మాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి 2017లో రూ.1.70 కోట్లు నిధులను మంజూరు చేసింది. అయితే ఒక్క గుప్తకామేశ్వరి గర్భగుడి మాత్రమే నిర్మించారు. ఆలయ గోపురం, పూర్వ మంటపం, సంపాపతి ఘాట్, జటాయువు మోక్ష ఘాట్ పనులు జరగలేదు. లేపాక్షికి విచ్చేసే పర్యాటకులు జటాయువు ఘాట్‌ను కూడా సందర్శించే వారు. అయితే కాంట్రాక్టర్ మృతి చెందడం, పనులు ఆగిపోవడం, తిరుమల తిరుపతి పాలక మండలి దృష్టికి తీసుకోలేకపోవడం తదితర కారణాలతో అభివృద్ధి కుంటుపడింది. తిరుమల తిరుపతి పాలక మండలి, దేవదాయశాఖ, పర్యాటకశాఖ వారు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మాటలకే పరిమితమైన ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన లేపాక్షి ఆలయానికి నిత్యం ప్రముఖులు వస్తూనే ఉంటారు. వారి వెంట ఉన్నతాధికారులు సైతం వచ్చి వెళ్తుంటారు. అయితే జటాయువు మోక్ష ఘాట్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయిన విషయం తెలిసినా పనులు పూర్తి చేసే దిశగా ఎవరూ ప్రయత్నించడం లేదు. మరోవైపు ఎమ్మెల్యే బాలకృష్ణ లేపాక్షి ఆలయ ఖ్యాతిని దశ దిశలా వ్యాపింపజేసేందుకు చర్యలు చేపడతామని ఎన్నోసార్లు చెప్పినా.. ఆ మాటలు కేవలం నీటి మీద రాతలుగానే మారాయన్న విమర్శలున్నాయి. కేవలం సినిమాలకే పరిమితమైన ఆయన నియోజకవర్గంతో పాటు లేపాక్షి అభివృద్ధిని అటకెక్కించారని స్థానికులు వాపోతున్నారు.

టీటీడీ దృష్టికి తీసుకెళ్తాం



జటాయువు ఘాట్‌తోనే లేపాక్షికి పేరు వచ్చింది. అలాంటి ఘాట్‌ను అభివృద్ధి చేయడానికి తిరుమల తిరుపతి పాలక మండలి దృష్టికి తీస్తాం. తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఘాట్ వద్ద కొంత అభివృద్ధి చేశాము. అర్ధాంతరంగా ఆగిపోయిన పనులను పునరుద్ధరించడానికి, అభివృద్ధి పనులు చేసేందుకు నివేదికను తయారు చేసి టీటీడీ వారికి నివేదిస్తాము.

– రమానందన్, లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్

ఘాట్‌ను అభివృద్ధి చేయాలి



లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన తరువాత చాలా మంది భక్తులు, పర్యాటకులు జటాయువు మోక్ష ఘాట్‌ను సందర్శిస్తుంటారు. అయితే జటాయువు మోక్ష ఘాట్ పనులు పూర్తి చేయక పోవడంతో వచ్చిన భక్తులు వెనుతిరిగి పోతున్నారు. జటాయువు మోక్ష ఘాట్‌ను అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగి లేపాక్షి పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

– నాగరాజు, విశ్రాంతి ఉపాధ్యాయుడు, లేపాక్షి

నేడు కొడిగెనహళ్లిలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'

పరిగి: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రం కొడిగెనహళ్లిలో శనివారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తప్పక పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి



హనుమంతప్ప భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్

అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామానికి చెందిన విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ హనుమంతప్ప (55) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న తహసీల్దార్ సుబ్బరావు సిబ్బందితో వెళ్లి హనుమంతప్ప భౌతిక కాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం మృతుని భార్య ఓబుళ రంగమ్మకు ప్రభుత్వం తరుపున తక్షణ ఆర్థిక సహాయం కింద రూ.15 వేల అందజేశారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ చంద్రశేఖరరావు, వీఆర్ఓ నరసింహమూర్తి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ

హిందూపురం అర్బన్: రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంవీఐ ఉదయ్‌కుమార్‌నాయుడు పేర్కొన్నారు. జాతీయ రోడ్డు మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై డ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎంవీఐ ఉదయ్‌కుమార్‌నాయుడు మాట్లాడుతూ హిందూపురం, చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లోని గార్మెంట్స్ పరిశ్రమలకు మహిళలను తరలించే సమయంలో డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నారు. ఇకపై నిబంధనలు మీరితే కేసులు నమోదు చేస్తామన్నారు. హిందూపురం, గోరంట్ల ప్రాంతాల్లో ఇప్పటికే రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించామన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి

చిలమత్తూరు: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవి సమీపిస్తోందని అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వీరాపురం పంచాయతీలోని లక్ష్మీపురంలో సొంత నిధులతో పాఠశాల తాత్కాలిక భవనాలు కట్టించామని, విద్యాశాఖా అధికారులు శాశ్వత భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో విద్యుత్ ఏఈకి నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓని కోరారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ. 10 లక్షలు తమ పంచాయితీకి మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని సర్పంచ్ తిరుమలేష్ కోరగా ఏఏ పనులు చేపట్టాలో అధికారులు అంచనా వేయాలని ఎంపీపీ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు మధ్య మండల మీట్ నిర్వహించారు.

అటవీశాఖ అధికారి కుళ్లాయప్ప అవినీతిపై ఫిర్యాదు

మడకశిర: మడకశిరలో అటవీశాఖ అధికారిగా పని చేస్తున్న కుళ్లాయప్పపై శుక్రవారం కట్టెల వ్యాపారులు వీరభద్రప్ప, రంగస్వామి తదితరులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పట్టణంలోని అనంతనారాయణ కట్టెల మిల్లును లీజుకు తీసుకుని నడుపుతున్నామని బాధితులు తెలిపారు. తరచూ కట్టెల మిల్లు వద్దకు అటవీశాఖ అధికారి కుళ్లాయప్ప వచ్చి డబ్బులు ఇవ్వకపోతే మీపై అక్రమ కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికే దాదాపు రూ.లక్షకు పైగా డబ్బులు అటవీశాఖ అధికారికి కట్టామన్నారు. స్పందించిన మాజీ ఎమ్మెల్సీ ఫోన్ ద్వారా జిల్లా అటవీశాఖాధికారి (డీఎఫ్ఓ)కు కుళ్లాయప్పకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

రేపు యోగి వేమన జయంతి వేడుకలు

మడకశిరరూరల్: పట్టణంలోని ఆదిరెడ్డిపాళ్యంలోని యోగి వేమన సర్కిల్‌లోని విగ్రహం వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు యోగి వేమన జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు రెడ్డి సంఘం సభ్యులు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలన్నారు.



సందడిగా ఉట్ల పరుష

పావగడ: తాలూకాలోని దొడ్డహళ్లి గ్రామంలో వరదాంజనేయస్వామి జాతరోత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఉట్ల పరుష సందడిగా సాగింది. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన ఉట్ల మాను ఎక్కేందుకు యువకులు పోటీ పడ్డారు. ఉట్ల పరుషను తిలకించడానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు.

సవిత.. నోరు అదుపులో పెట్టుకో..





నూతన వార్డు కమిటీని అభినందిస్తున్న ఉషశ్రీ చరణ్ , శ్రీరంగరాజుపల్లిలో పార్టీ శ్రేణులతో కలిసి టీ తాగుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

- వైఎస్ జగన్ గురించి మాట్లాడే అర్హత నీకు లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత మంత్రి సవితకు లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం శివానగర్‌లోని చౌడేశ్వరి కళ్యాణ మంటపంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. సంక్రాంతి పండుగ రోజు పెనుకొండ జూనియర్ కళాశాల మైదానంలో మంత్రి సవిత వైఎస్ జగన్‌ను సైకో అని సంబోధించడం తగదన్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో లబ్ధిదారులకు పథకాలు రూపంలో డబ్బులు జమ చేస్తే మద్యం, గంజాయికి బానిసయ్యారని ఇప్పటికే చట్ట సభల్లో మంత్రి సవిత మాట్లాడారన్నారు. ముందు ఆమె సభ్యత నేర్చుకోవాలని, మరోసారి నోరు జారితే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. పోలీసులు టీడీపీ అడుగు జాడల్లో నడుస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయిస్తుండటం సరికాదన్నారు. సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీని అయితే చింపారుగాని ప్రజల హృదయాల్లో ఆయనపై అభిమానాన్ని చెరిపి వేయలేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, జెడ్పీటీసీ అశోక్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమాకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, సర్పంచులు అంజినాయక్, కిష్టప్ప, వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కంబాలప్ప, సింగిల్ విండో చైర్మన్ ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారిని గుర్తిస్తాం

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పనిచేసే ప్రతి కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఇస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని శివానగర్‌లో పార్టీ వార్డు కమిటీని ఎన్నుకున్నారు. బూత్ కన్వీనర్‌గా బాబావలి, వార్డు అధ్యక్షుడిగా ఉపేంద్ర, ఉపాధ్యక్షుడిగా గణేష్, యువజన అధ్యక్షుడిగా గోవిందరాజులు, రైతు విభాగం సంజీవ రాయప్ప, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు ఆదిమూర్తి, చేనేత విభాగానికి వెంకటేశులు, ప్రచార విభాగానికి మారుతీ, పంచాయతీరాజ్‌కు తిమ్మారెడ్డి, గ్రీవెన్స్ సెల్‌కు నరసింహులు ఎన్నుకున్నారు. స్థానిక నాయకులు జి.శ్రీనివాసులు, మంజు, లక్షీనరసింహ, తిప్పన్న, లక్ష్మీదేవి, రామాంజి తదితులు పాల్గొన్నారు.

ఒక్క పథకమూ రాలేదమ్మా

పరిగి: 'కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గంపెడాశలతో ఉన్న మాకు ఒక్క పథకమూ రాలేదమ్మా' అంటూ శ్రీరంగరాజుపల్లి గ్రామ మహిళలు మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌తో గోడు వెల్లబోసుకున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలను అన్ని విధాలా ఆదుకున్నారని చెప్పారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో శుక్రవారం ఉదయం «కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్» కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ గ్రామ సమస్యలు తెలుసుకుంటూ వీధుల వెంట కలియ తిరిగి ప్రజలతో మమేకమయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి ఏడు నెలలు అయినప్పటికీ ఏ ఒక్క సంక్షేమ పథకమూ తమకందలేదని ఉషశ్రీచరణ్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా సంక్షేమ పథకాలతో తమ ఆర్థికాభివృద్ధికి పాటుపడిన జగనన్నను ఎన్నటికీ మరచిపోమన్నారు. కానీ వంచనతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాన్ని మరోసారి చూస్తున్నందుకు బాధపడుతున్నామని వాపోయారు.

మంత్రి సవితపై ప్రజల ఆగ్రహం

గత ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మంత్రి సవితపై శ్రీరంగరాజుపల్లి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిగి నుంచి అధ్వానంగా ఉన్న గ్రామ రోడ్డును అధికారంలోకి వచ్చిన మూడు నెలలోలోపే వేస్తామని చెప్పిన సవిత ఆ తర్వాత పట్టించుకోలేదన్నారు. అలాగే జయమంగళీ నదిపై కొత్తగా వంతెన (బ్రిడ్జ్)ను నిర్మిస్తామని చెప్పినా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు.

అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ భరోసా ఇచ్చారు. కష్టాలు శాశ్వతంగా ఉండవని, పార్టీ తిరిగి అధికారంలోకి తప్పక వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, ముఖ్య నాయకులు నరసింహారెడ్డి (చంటి), శ్రీనివాసరెడ్డి, సూరి, శివానందరెడ్డి, కిరణ్, శ్రీనివాసులు, సోము, తిప్పన్న, నరసింహమూర్తి, శంకరరెడ్డి, నారాయణస్వామి, సంజీవరెడ్డి, రంగదామప్ప, నరసింహప్ప, నాగప్ప, మాజీ సర్పంచ్ వెంకటరమణ, సుబ్బారెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మానేపల్లిలో 'డ్రైడే'

లేపాక్షి: మండలంలోని మానేపల్లి శుక్రవారం ఉదయం వైద్య సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీలోని వివిధ వీధుల్లో దోమల నిల్వ ప్రాంతాల్లో నివారణ మందులు పిచికారీ చేశారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

క్యాలెండర్ల విడుదల

పావగడ: స్థానిక తాలూకా కాంట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్లను పట్టణంలోని అతిథి గృహంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ల సంఘం సభ్యులు ఇటీవల తుమకూరు జిల్లా పాల ఉత్పత్తి సహకార సంఘం డైరెక్టర్‌గా విజయం సాధించిన కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు బెళ్లిబట్లు చంద్రశేఖరరెడ్డిని సన్మానించారు.

గర్భిణులకు అన్నదానం

లేపాక్షి: పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులకు కరణం రమామణి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉంటే పుట్టే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆ ట్రస్ట్ చైర్మన్ రమానందన్ పేర్కొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

అగళి: సమాచార హక్కు చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని రైతు సేవ కేంద్ర సిబ్బంది దినేష్, ప్రశాంత్, షాపియా తెలిపారు. మండల పరిధిలోని ఆర్ జీ పల్లి, ఇరిగేపల్లి, బ్యాడగేర్, హెచ్‌డీ హళ్లి రైతు సేవ కేంద్రంలో రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

అగళి: సువర్ణముఖి వంక నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ సుబ్బరావు, ఎస్ఐ వీరేష్ తెలిపారు.



అలంకరణలో చౌడేశ్వరీదేవి

● వైభవంగా జ్యోతుల ఉత్సవం

హిందూపురం: హిందూపురం చౌడేశ్వరి కాలనీ 2వార్డులో చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశేష భక్తజనం మధ్య జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. జ్యోతులను తలపై ఎత్తుకుని గజ్జకట్టి నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి దీపారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాజు, వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్ రామచంద్ర, వేణుగోపాల్, భాను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం: జ్యోతులు ఎత్తుకొని నృత్యం చేస్తున్న భక్తులు